

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.155	230	260
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.0

లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలకు గాను భువనగిరిలో 76.78శాతం పోలింగ్ నమోదై ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా నల్లగొండ లోక్‌సభ స్థానం పరిధిలో 74.02శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఉమ్మడి జిల్లా యంత్రాంగం ఆశించిన స్థాయిలో పోలింగ్ నమోదుకాలేదు. రెండు లోక్‌సభ స్థానాల పరిధిలో మొత్తం 8,68,233 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. అందులో 4,61,090 మంది మహిళలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఒక్క భువనగిరి లోక్‌సభ పరిధిలో 4,19,905, నల్లగొండ పరిధిలో 4,48,328 మంది ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉన్నారు.

● (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)/నల్లగొండ



పోలింగ్‌కు దూరంగా 8.68లక్షల ఓటర్లు

- భువనగిరి పరిధిలో 4.19లక్షల మంది
- నల్లగొండ పరిధిలో 4.48లక్షల మంది
- ఓటేయని వారిలో మహిళలే అధికం
- ఓటు నమోదుతోనే సరి.. పోలింగ్ కేంద్రాలకు రాని వైనం

యాదాద్రి లోక్‌సభ పరిధిలో అర్బన్ ప్రాంతం కంటే రూరల్ ఏరియా అధికంగా ఉండటంతో 85శాతం మేర పోలింగ్ నమోదవుతుందని జిల్లా యంత్రాంగం ఆశించింది. ఆ మేరకు పోలింగ్ శాతం నమోదుకాలేదు. నియోజకవర్గంలో మొత్తం 18,08,585మంది ఓటర్లు ఉన్నారు. అందులో 8,98,416 మంది పురుషులు, 9,10,090 మంది మహిళలు, 79మంది ఇతరులు ఉన్నారు. పురుషుల కంటే 11,674 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో 13,88,680 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 7,02,636మంది పురుషులు, 6,86,003 మంది మహిళలు, 41మంది ఇతరులు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 4,19,905మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. వీరిలో 1,95,780 మంది పురుషులు, 2,24,087 మంది మహిళలు ఉన్నారు. మహిళా ఓటర్లు అధికంగా ఉన్నా, ఈ సారి ఓటేసేందుకు ముందుకు రాలేదు.

● నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో 74.02 శాతం పోలింగ్ నమోదైంది. పార్లమెంటు పరిధిలో మొత్తం 17,25,465 మంది ఓటర్లు ఉండగా, 12,77,137 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 4,48,328 మంది ఓటుకు దూరంగా ఉన్నారు. అందులో 2,37,003 మంది మహిళలు ఓటు వేయలేదు. పురుషులు 2,11,246 మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు. 8,44,843 మంది పురుష ఓటర్లకు గాను 6,33,597 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 8,80,453మంది ఉండగా, 6,33,597 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతర ఓటర్లు 169మంది ఉండగా, 90మంది ఓటు వేయగా, 79మంది ఓటేయలేదు.

పోలింగ్ పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు

రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించింది. ఓటర్లను చైతన్యం చేయడం కోసం అధికార యంత్రాంగం పలు కార్యక్రమాలను నిర్వహించింది. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా ఓటర్లకు అవగాహన కల్పించడంతో పాటు 80నుంచి 85శాతం వరకు ఓట్లు పోల్ కావడం కోసం అధికారులు కృషి చేశారు. తాజా పోలింగ్ శాతంతో అసెంబ్లీ ఎన్నికలపై ఉన్న ఆసక్తి పార్లమెంట్ ఎన్నికల్లో లేదనేది తేలింది. మొత్తంగా నల్లగొండ పార్లమెంట్ పరిధిలో 74.02శాతం పోలింగ్ నమోదైంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అనంతరం స్వీప్ పేరుతో ర్యాలీలు, సభలు, సమావేశాలు పెద్ద సంఖ్యలో నిర్వహించి ఓటర్లలో అవగాహన కల్పించేందుకు యంత్రాంగం కృషిచేసింది. అయినా ఓటర్లలో చైతన్యం పెరగలేదు. విధిగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు చాలా మంది ముందుకు రావడంలేదు. రాజకీయ పార్టీలు సైతం స్థానిక సంస్థలు, శాసనసభ ఎన్నికల సమయంలో ఓటర్లు ఎక్కడున్నా పిలిపించి మరీ ఓటింగ్‌లో పాల్గొనేలా చూశారు. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం అంతగా పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి. ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాల వద్ద పలు మౌలిక వసతులు కల్పించింది. ప్రతీ పోలింగ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటుచేసి ఓటర్లకు అవసరమైన సమాచారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంది. ఓటు వేసేందుకు వచ్చినవారు ఎక్కువ సమయం క్యూలైన్లలో నిలుచోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. అంతేగాక ఈసారి వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలింగ్ సమయాన్ని అదనంగా గంట పెంచింది. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, షామియాల సౌకర్యం కల్పించింది. వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు క్యూలైన్ లైన్‌తో నిమిత్తం లేకుండా పోలింగ్ కేంద్రంలోకి అనుమతించారు. అయినా చాలా మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

భువనగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో నియోజకవర్గాల వారీగా పురుషులు, మహిళల పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	పోలైన ఓట్లు (శాతం)	ఓటేసిన పురుషులు (శాతం)	ఓటేసిన మహిళలు (శాతం)	ఓటేసిన ఇతరులు (శాతం)
ఇబ్రహీంపట్నం	3,39,341	1,70,807	1,68,499	35	2,26,790 (66.83%)	1,15,723 (67.75%)	1,11,060 (65.91%)	07 (18.42%)
మునుగోడు	2,57,557	1,28,233	1,29,321	03	2,15,611 (83.71%)	1,08,693 (84.76%)	1,06,917 (82.67%)	01 (33.33%)
భువనగిరి	2,20,596	1,08,801	1,11,794	01	1,82,462 (82.71%)	92,017 (84.57%)	90,445 (80.90%)	00 (0%)
నకిరేకల్	2,53,785	1,25,451	1,28,330	04	1,95,693 (77.11%)	98,848 (78.79%)	96,843 (75.46%)	02 (50%)
తుంగతుర్తి	2,59,265	1,28,719	1,30,539	07	1,92,005 (74.06%)	97,288 (75.58%)	94,713 (72.55%)	04 (57.14%)
ఆలేరు	2,35,270	1,16,914	1,18,337	19	1,94,817 (82.81%)	99,073 (84.74%)	95,726 (80.89%)	18 (94.73%)
జనగామ	2,42,771	1,19,491	1,23,270	10	1,81,302 (74.68%)	90,994 (76.15%)	90,299 (73.25%)	09 (90%)
మొత్తం	18,08,585	8,98,416	9,10,090	79	13,88,680 (76.78%)	7,02,636 (78.20%)	6,86,003 (75.37%)	41 (51.89%)

నల్లగొండ పార్లమెంట్ స్థానం పరిధిలో నియోజకవర్గాల వారీగా పురుషులు, మహిళల పోలింగ్ శాతం ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	పోలైన ఓట్లు (శాతం)	ఓటేసిన పురుషులు (శాతం)	ఓటేసిన మహిళలు (శాతం)	ఓటేసిన ఇతరులు (శాతం)
దేవరకొండ	2,62,480	1,31,838	1,30,624	18	1,85,310 (70.60%)	94,896 (71.97%)	90,405 (69.21%)	09 (50%)
నాగార్జునసాగర్	2,36,484	1,15,852	1,20,611	21	1,76,190 (74.50%)	87,949 (75.91%)	88,231 (73.15%)	10 (47.61%)
మిర్యాలగూడ	2,36,343	1,15,773	1,20,544	26	1,73,334 (73.34%)	85,811 (74.12%)	87,513 (72.59%)	10 (38.46%)
హుజూర్‌నగర్	2,51,444	1,21,956	1,29,471	17	1,91,945 (76.34%)	94,065 (77.13%)	97,871 (75.59%)	09 (52.94%)
కోదాడ	2,45,187	1,19,172	1,25,997	18	1,84,415 (75.21%)	90,601 (76.02%)	93,801 (74.44%)	10 (55.55%)
సూర్యాపేట	2,44,116	1,18,949	1,25,154	13	1,78,378 (73.07%)	88,069 (74.03%)	90,301 (72.15%)	08 (61.53%)
నల్లగొండ	2,49,411	1,21,303	1,28,052	56	1,87,565 (75.20%)	92,203 (76.01%)	95,328 (71.44%)	34 (60.71%)
మొత్తం	17,25,465	8,44,843	8,80,453	169	12,77,137 (74.02%)	6,33,597 (74.99%)	6,43,450 (73.08%)	90 (53.25%)

పట్టభద్రుల ఎమ్మెల్సీ

ఉప ఎన్నికకు సన్నాహాలు

- అభ్యర్థుల ప్రచారానికి 10 రోజులే గడువు
- 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్
- జూన్ 5వ తేదీన కౌంటింగ్
- మూడు ఉమ్మడి జిల్లాల్లో 4,63,839మంది పట్టభద్ర ఓటర్లు



ప్రధాన పార్టీలన్నీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దృష్టిసారించాయి.

నల్లగొండ, మే 15: వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఓ వైపు అధికారులు ఎన్నిక ప్రక్రియలో నిమగ్నం కాగా, ప్రధాన పార్టీలైన అయిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారాన్ని సైతం ప్రారంభించారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కావడంతో ఆయా పార్టీల అధిష్ఠానాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై దృష్టిసారించి సత్తా చాటేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. అభ్యర్థుల ప్రచారానికి కేవలం 10 రోజుల గడువు ఉంది. ఈ నెల 25వ తేదీన 5గంటలకు ప్రచారం ముగించాల్సి ఉంటుంది. 27వ తేదీన ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. కౌంటింగ్‌ను జూన్ 5వ తేదీన నిర్వహించనున్నారు.

ఎమ్మెల్సీ పట్టభద్ర నియోజకవర్గం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలోని 12 జిల్లాల్లో విస్తరించి ఉండటంతో ఈ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. మూడు జిల్లాలకు రిటర్నింగ్ అధికారిగా నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వ్యవహరించనున్నారు. ఆయా జిల్లాలకు అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు డివిజన్ల వారీగా ఏఆర్‌వోలుగా వ్యవహరించనున్నారు. అదేవిధంగా 12 జిల్లాల్లో మొత్తం 605 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. మొత్తం 4,63,839మంది పట్టభద్ర ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. వీరంతా ఈ ఉప ఎన్నికలో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రధాన పార్టీల ప్రచారం ముమ్మరం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇప్పటికే సమీక్షలు నిర్వహించాయి. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మూడు ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మాజీ ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తుండగా, ఎలాగైనా ఈ స్థానాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీజేపీ పట్టుదలతో ఉన్నాయి. ప్రచారానికి కేవలం 10 రోజుల గడువు ఉంది. ఈ నేపథ్యంలో పట్టభద్రులను ఆకట్టుకునేందుకు ఏ విధంగా ముందుకు సాగాలనే దానిపై పార్టీలు కార్యాచరణ రూపొందిస్తున్నాయి. అగ్ర నాయకులు సైతం తమ పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం కోసం పట్టభద్రులతో ముఖాముఖి సమావేశాలను నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగియడంతో

ప్రచారానికి అభ్యర్థులు అనుమతి తీసుకోవాలి



పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ పరిధి మూడు ఉమ్మడి జిల్లాలోని 12 జిల్లాల్లో విస్తరించి ఉంది. 12మంది అదనపు కలెక్టర్లు ఏఆర్‌వోలుగా ఉన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేసుకోవచ్చు. దానికి సంబంధించిన అనుమతులు జిల్లా స్థాయిలో ఏఆర్‌వోల వద్ద, మొత్తం నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించాలంటే నల్లగొండ జిల్లాలోని ఆర్‌వో కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. ఎన్నికల ప్రవర్తన నియమావళి పార్లమెంటు ఎన్నికల మాదిరిగానే ఉంటుంది. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. నియోజకవర్గ పరిధిలోని 12 జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశాం. అక్కడి నుంచే బ్యాలెట్ పత్రాల పంపిణీ ఉంటుంది. పోలింగ్ అనంతరం 12 జిల్లాలకు చెందిన బ్యాలెట్ బాక్సులు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలిస్తాం. జూన్ 5వ తేదీన కౌంటింగ్ నిర్వహిస్తాం.

● దాసరి హరిచందన, రిటర్నింగ్ అధికారి

జిల్లాల వారీగా పట్టభద్ర ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిద్దిపేట	3,122	1,557	0	4,679
జనగామ	14,915	8,503	1	23,419
హన్మకొండ	25,739	17,990	0	43,729
వరంగల్	27,038	16,774	0	43,812
మహబూబాబాద్	22,948	11,985	0	34,933
ములుగు	6,587	3,719	0	10,299
జె.భూపాలపల్లి	8,000	4,535	0	12,535
కె.భద్రాద్రి	22,590	17,516	0	40,106
ఖమ్మం	50,676	33,199	4	83,879
యాద్రాద్రి	20,838	13,242	0	34,080
సూర్యాపేట	34,176	17,321	0	51,497
నల్లగొండ	51,560	29,311	0	80,871
మొత్తం	2,88,189	1,75,645	5	4,63,839

ఉప ఎన్నికకు బ్యాలెట్ బాక్సులు సిద్ధం




వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ టౌన్, మే 15: వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణకు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసినట్టు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు, నియోజకవర్గం పరిధిలోని 12 జిల్లాల ఏఆర్‌వోలు పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అదనపు అధికారులు సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్ కుమార్, డిప్యూటీ సీఈవో సత్యవాణి మాట్లాడుతూ, శాసన మండలి ఉప ఎన్నిక బ్యాలెట్ బాక్స్‌లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, శాసన మండలి ఉప ఎన్నిక నిర్వహణకు సరిపడా బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని, ఎన్నికల కోడ్ ఉల్లంఘన, అనుమతులు, ఎన్నికల ప్రచారం, ఎన్నికల ర్యాలీలు, అభ్యర్థులు పాటించాల్సిన విషయాలపై బుధవారం నిర్వహించిన సమావేశంలో అవగాహన కల్పించామని వివరించారు. బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి ఏఆర్వోలు ఎప్పటికప్పుడు రిజిస్టర్ నిర్వహించాలని, అభ్యర్థులకు అనుమతులు మాన్యువల్‌గా ఇస్తామని, ఎఫ్ఎస్‌టీ బృందాలు కొనసాగుతాయని తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో మిర్యాలగూడ, చండూరు ఆర్డీవోలు శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

17 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

నల్లగొండ, మే 15: డిగ్రీ రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, ఒకటి, మూడు, ఐదు బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎంజీయూ ప్రతినిధి ఉపేందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పరీక్షలకు సంబంధించిన వివరాలను సంబంధిత విభాగాలను సంప్రదించి హాజరు కావాలని కోరారు.

మెరుగైన పీఆర్సీ ప్రకటించాలి: పీఆర్టీయూ



పీఆర్సీ చైర్మన్‌తో పీఆర్టీయూ (తెలంగాణ) నాయకులు సునీల్, శ్రీనివాస్‌గౌడ్

నల్లగొండ రూరల్, మే 15: మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా నాయకులు కోరారు. పీఆర్సీ చైర్మన్ శివశంకర్‌ను బుధవారం హైదరాబాద్‌లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. జిల్లాకేంద్రం హెచ్ఆర్ఏ స్లాబ్ రేట్‌ను 25శాతానికి పెంచాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, మహిళలకు 180 రోజుల చైల్డ్‌కేర్ లీవ్‌తోపాటు పలు సమస్యలను పరిష్కరించాలని ఆయన దృష్టికి తీసుకెళ్లాను. పీఆర్సీ చైర్మన్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, సంఘం నాయకులు ఎం.చెన్నయ్య, సుంకరి భిక్షం గౌడ్, మంకెన రామచంద్రారెడ్డి, అద్దంకి సునీల్, వీరమల్ల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎన్నికల కోడ్‌ను పాటించాలి

ఉప ఎన్నిక సాధారణ పరిశీలకుడు రాహుల్ బొజ్జా



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌బొజ్జా


నల్లగొండ, మే 15: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో పోటీలో ఉన్న అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించాలని ఉప ఎన్నిక జిల్లా సాధారణ పరిశీలకుడు రాహుల్ బొజ్జా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని సులభంగా తీసుకోవద్దని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. ప్రచారం సందర్భంగా కులం, మతం, ఎదుటి వ్యక్తులను దూషించడం, ప్రార్థన స్థలాల్లో ప్రచారం వంటివి చేయవద్దని ఆయన సూచించారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన మాట్లాడుతూ పోటీలో ఉన్న అభ్యర్థులు పార్లమెంట్ ఎన్నికల ప్రచార సైలెన్స్ పీరియడ్ పూర్తయినందున పూర్తి స్థాయిలో ప్రచారం నిర్వహించుకోవచ్చని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ఆర్డీవో రవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతం : కలెక్టర్

పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నల్లగొండ పార్లమెంట్ స్థానంలో 74.03 శాతం పోలింగ్ నమోదైందని, పోస్టల్ బ్యాలెట్ ద్వారా మరో 2 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. 7 నియోజకవర్గాల నుంచి ఈవీఎంలు జిల్లా కేంద్రంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఈ స్ట్రాంగ్ రూం వద్ద మూడంచెల భద్రతా ఏర్పాటు చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన ఉంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రాజెక్టుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

629అడుగులకు చేరిన నీటిమట్టం



629 అడుగులకు చేరిన మూసీ జలాశయం

కేతేపల్లి, మే 15: మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 629.15 అడుగులకు చేరింది. మండుతున్న వేసవిలోనూ ఎగువ మూసీ నది నుంచి ఇన్‌ఫ్లో నిరంతరాయంగా కొనసాగుతోంది. దీంతో 645 అడుగులు (4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నీటిమట్టం గత నెల మొదటి వారంలో 618 అడుగులు (0.38టీఎంసీలు) కనిష్ఠస్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో ఎగువ మూసీ నదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాల్లోని గల కత్వాలు, ధర్మారెడ్డి కాల్వ, పిలాయిపల్లి, అసిఫ్‌నహర్ కల్వాలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలంలోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. ఆయా చెరువులు, కుంటల అలుగుల నుంచి వచ్చే నీరంతా ప్రస్తుతం దిగువన గల మూసీ ప్రాజెక్టుకు చేరుతుండటంతో గత 20 రోజులుగా ప్రాజెక్టుకు దాదాపు 800 క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎగువ నుంచి నిలకడగా వస్తున్న ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా ఒక్కో అడుగు చొప్పున పెరుగుతూ వస్తోంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 629.15అడుగులు (1.28టీఎంసీలు)గా నమోదైంది. ఎగువ నుంచి 576 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 77 క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళుతుంది. కాగా గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 640.65 అడుగులు (3.37టీఎంసీలు)గా, ఇన్‌ఫ్లో 482 క్యూసెక్కులుగా ఉంది.

ధాన్యం కొనుగోలు కోసం హైవే దిగ్బంధం

● గంటపాటు హైదరాబాద్-వరంగల్ హైవేపై రాస్తారోకో ● ధాన్యానికి నిప్పుపెట్టి రైతుల నిరసన ● అధికారుల హామీతో విరమణ



ఆందోళన చేస్తున్న రైతులు, ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టి నిరసన

బీబీనగర్, మే 15: ధాన్యం కొనుగోలులో జాప్యంతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంపై కడుపు మండిన రైతులు రోడ్డెక్కారు. బుధవారం జాతీయ రహదారిని నిర్బంధించి ఆందోళనకు దిగారు. ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు గ్రామస్తులు ధాన్యం కొనుగోలు నిలిచిపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిని నిర్బంధించారు. రోడ్డుపై బైఠాయించి ధాన్యం బస్తాలకు నిప్పు పెట్టి నిరసన తెలిపారు. రైతులు గడ్డం చిన్న యాదిరెడ్డి, గూడూరు మాధవరెడ్డి, దవారి సత్తయ్య, బింగి సాయిలు, గూడూరు విజయ, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు బాల ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో పది రోజులుగా కొనుగోలు నిలిపివేశారని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రానికి 120మంది రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి నెల రోజులు గడిచిపోతున్నాయని ఇప్పటి వరకు సకాలంలో కొనుగోలు చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు కేవలం 40మంది రైతుల ధాన్యాన్ని మాత్రమే సేకరించారని తెలిపారు. కాంట వేసిన మూడు వేల ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో కేంద్రంలోనే ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి మొలకెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. త్వరితగతిన కొనుగోలు చేపట్టాలని సంబంధిత అధికారులకు అనేకసార్లు మొరపెట్టుకున్న స్పందన లేకపోవడంతోనే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోలు జరిపి తరుగు లేకుండా చెల్లింపులు జరపాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకుని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. తహసీల్దార్ శ్రీధర్ రైతులతో చర్చలు జరిపి రైతుల డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. గంట సేపు జరిగిన ధర్నాతో రోడ్డుకు ఇరు వైపుల భారీగా వాహనాలు నిలిచిపోయాయి.

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

భువనగిరి అర్బన్: వారాల తరబడి కొనుగోళ్లలో జాప్యానికి తోడు అకాల వర్షాలకు మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు ఆందోళన బాట పట్టారు. మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. భువనగిరి మండలం సూరేపల్లి, పచ్చర్లబోడుతండా రైతులు వేర్వేరుగా ఆటోల్లో సుమారు 50మంది కలెక్టరేట్‌కు వచ్చి గేట్ ఎదుట ఆందోళన చేపట్టి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తరలించేందుకు లారీలను వెంటనే ఏర్పాటుచేయాలన్నారు. రైతుల ఆందోళన సమాచారం అందుకున్న పౌర సరఫరాల శాఖ డీఎం గోపీకృష్ణ అక్కడకు చేరుకుని రైతులను సముదాయించారు. కొనుగోలు కేంద్రాలకు లారీలను గురువారంలోగా ఏర్పాటు చేస్తామని, వారం రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తామన్న హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి తిరుగు ప్రయాణమయ్యారు. లారీలు కల్లాల వద్దకు చేరుకోకుంటే మరోసారి ఆందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు.

గుట్టలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

భువనగిరి అర్బన్, మే 15: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో నిత్య పూజలు బుధవారం శాస్త్రోక్తంగా జరిగాయి. సుప్రభాత సేవతో స్వయం భువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయం భువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారలను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజ వాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపారు. అదేవిధంగా కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. మహామడపంలో స్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొన సాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.28,15,904 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో అభ్యర్థులు వీరే

అభ్యర్థి పేరు	పార్టీ
గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి	బీజేపీ
తీన్మార్ మల్లన్న	కాంగ్రెస్
ఏనుగుల రాకేష్‌రెడ్డి	బీఆర్ఎస్
కర్నె రవి నేషనల్	నవక్రాంతి
గుండాల జ్యోతి	తెలంగాణ రిపబ్లికన్ పార్టీ
చెన్న శ్రీకాంత్	సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా
జాజుల భాస్కర్	శ్రమజీవి పార్టీ
జానయ్య నందిపాటి	తెలంగాణ సకల జనుల పార్టీ
పాటి శ్రీకాంత్‌రెడ్డి	ప్రజావాణి పార్టీ
పూస శ్రీనివాస్	తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ సమితి
బరిగల దుర్గప్రసాద్	డీఎస్పీ
ఈద శేషగిరి రావు	అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ
డాక్టర్ దేశగాని సాంబశివగౌడ్	బ్లూ ఇండియా
సోదే వెంకటేశ్వర్లు	గోండువానా దండకారణ్య పార్టీ
అనిల్‌కుమార్ గాదెపాక	స్వతంత్ర
అంబాల రాజేష్	స్వతంత్ర
తేలు అన్నరవి యాదవ్	స్వతంత్ర
అశోక్ కుమార్ పాలకూరి	స్వతంత్ర
ఏఎస్.కృష్ణ	స్వతంత్ర
అయితగోని రాఘవేంద్ర	స్వతంత్ర
కంటే సాయన్న	స్వతంత్ర
కృష్ణంరాజు మెండెం	స్వతంత్ర
కోడిరెక్క ఉమాశంకర్	స్వతంత్ర
డాక్టర్ గడ్డం మల్లేష్	స్వతంత్ర
గుగులోతు బీమా	స్వతంత్ర
చంద్రక్రాంతి కుమార్	స్వతంత్ర
చాలిక చంద్రశేఖర్	స్వతంత్ర
చీదేళ్ల ఉమామహేశ్వరీ	స్వతంత్ర
చెరుకు శివకుమార్ గౌడ్	స్వతంత్ర
జంగ సుధాకర్	స్వతంత్ర
జల్లారపు రమేష్	స్వతంత్ర
చిల్లెపల్లి వెంకటశ్యాంప్రసాద్	స్వతంత్ర
తాడిశెట్టి క్రాంతికుమార్	స్వతంత్ర
తేజావత్ వాసుదేవ్	స్వతంత్ర
దయాకర్ గజ్జి	స్వతంత్ర
దునుకు వేలాద్రి	స్వతంత్ర
పడిశెట్టి రాజు	స్వతంత్ర
పూజారి సత్యనారాయణ	స్వతంత్ర
పీటం మల్లికార్జున్	స్వతంత్ర
డాక్టర్ పెంచల శ్రీనివాస్	స్వతంత్ర
బక్క జాడ్సన్	స్వతంత్ర
బుగ్గ శ్రీకాంత్	స్వతంత్ర
బుర్ర ముత్తిలింగం	స్వతంత్ర
భైరవబట్ల శ్రీనివాసరావు	స్వతంత్ర
మాదవపెద్ది వెంకటరెడ్డి	స్వతంత్ర
మారం వెంకట్‌రెడ్డి	స్వతంత్ర
ముద్ర మల్లికార్జున్‌రావు	స్వతంత్ర
మోహన్‌రెడ్డి కొనకాల	స్వతంత్ర
యాతాకుల శేఖర్	స్వతంత్ర
రాజు నాయక్ గుగులోతు	స్వతంత్ర
గుగులోతు సంతోష్	స్వతంత్ర
సుంకరి లింగయ్య	స్వతంత్ర

పచ్చదనం కోల్పోయిన ప్రకృతి వనాలు



డిండి మండలం కామేపల్లిలోని పల్లెప్రకృతి వనం చెట్లు, మొక్కలు నరికి తగలబెట్టిన దృశ్యం

డిండి / కొండమల్లేపల్లి, మే 15: అధికారుల నిర్లక్ష్యం పల్లె ప్రకృతి వనాలకు శాపంగా మారింది. నల్లగొండ జిల్లా డిండి మండలం కామేపల్లిలో పల్లె ప్రకృతి వనం కాలిబూడిదైంది. వేల రూపాయలతో 14 గుంటల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన వనం 10 రోజుల క్రితం ఉపాధి కూలీలు ఆనవాళ్లు కనిపించకుండా నిప్పంటించి కాల్చివేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకపోగా ప్రభుత్వ ధనం వృథా అయింది. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి విధుల నిర్లక్ష్యం వల్లే పల్లె ప్రకృతివనం నష్టం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కార్యదర్శి నాగరాజును వివరణ కోరగా వనంలోని మొక్కల చుట్టు ఉన్న ఎండు పుల్లలు తొలగించాలని కూలీలను ఆదేశించి తాను మరో గ్రామానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి కూలీలు మొక్కలు, చెట్లు నరికి నిప్పంటించారని తెలిపారు. అదేవిధంగా కొండమల్లేపల్లి మండలంలోని పలుతండాల్లో నీళ్ల లేక హరిత హారం మొక్కలు ఎండిపోయాయి. గన్యానాయక్ తండాలో అరఎకరం విస్తీర్ణంలో 2వేల మొక్కలను నాటారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చెట్లకు నీళ్లు పోసేవారు లేక ఎండిపోయాయి. ఈ విషయమై గ్రామ కార్యదర్శి రేణుకను వివరణ కోగా గ్రామంలో బోరు ఎండిపోవడంతో నీరు లేక పల్లె ప్రకృతి చెట్లు ఎండిపోయయాని తెలిపారు.



కొండమల్లేపల్లి మండలం గన్యానాయక్‌తండాలో పల్లెప్రకృతి వనంలో ఎండిపోయిన హరిత హారం మొక్కలు



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనాయకులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన సమీక్షకు హాజరైన ఉమ్మడి నల్లగొండ జిల్లా నేతలు

ఆరు రోజుల్లో 3 లక్షలకుపైగా వాహనాల రాకపోకలు

● జంట నగరాలకు చేరుకున్న వేతన జీవులు ● జాతీయ రహదారిపై ఐదు రోజుల రద్దీ ● బుధవారం నాటికి సాధారణ స్థితికి



నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, మే 15: ఆరు రోజులపాటు రయ్.. రయ్.. మంటూ సాగిన వాహనాల రాకపోకలతో జాతీయ రహదారిపై ఉన్న రద్దీ బుధవారానికి సాధారణ స్థితికి చేరుకుంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పోలింగ్ ఉండడంతో హైదరాబాద్‌లో ఉంటున్న ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరడంతో నాలుగు రోజులుగా వాహనాల రద్దీ కొనసాగింది. ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సుల్లో, డీసీఎంలలో బయలుదేరిన ప్రజలు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ మీదుగా సుమారు 3 లక్షలకుపైగా వాహనాల్లో రాకపోకలు సాగించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. 13వ తేదీన పోలింగ్ ఉండటంతో ఈ నెల 10వ తేదీన జాతీయ రహదారిపై రద్దీ మొదలైంది. పంతంగి టోల్‌గేటు మీదుగా సాధారణంగా ప్రతీ రోజు 30వేల నుంచి 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పోలింగ్ నేపథ్యంలో ఈ నెల 10నుంచి 14వ తేదీ వరకు అదనపు వాహనాలతో పాటు ఐదు రోజుల్లో 65వేల వాహనాలు విజయవాడ వైపు వెళ్లాయి. వీటికితోడు పెద్దసంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ఓటర్లు తరలివెళ్లారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓటర్లు తిరిగి హైదరాబాద్ పయనమయ్యారు. దీంతో సుమారు రెండు వైపులా మూడు లక్షలకుపైగా వాహనాలు పోలింగ్‌కు ముందు నాలుగు రోజులు, పోలింగ్ తర్వాత మూడు రోజులు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించినట్లు జీఎంఆర్ ప్రతినిధులు తెలిపారు. జాతీయ రహదారిపై ఎక్కడ చూసినా వాహనాల సందడి కనిపించింది. జాతీయరహదారి వాహనాలతో కిక్కిరిసింది. హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లుకు భారీగా గిరాకీ పెరిగింది. పంతంగి టోల్‌గేటు వద్ద 16 గేట్లకు 10 గేట్ల ద్వారా విజయవాడ వైపు, తిరుగు ప్రయాణికులు మళ్లీ 10 గేట్ల ద్వారా వాహనాలను పంపించారు.

ట్రాఫిక్ సమస్య లేదు: శ్రీధర్‌రెడ్డి, జీఎంఆర్ ప్రతినిధి

పోలింగ్ నేపథ్యంలో ఆరు రోజుల్లో సుమారు 3 లక్షల వాహనాల రాకపోకలు సాగించినా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు నెలకొనలేదని జీఎంఆర్ ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పోలింగ్ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ట్రాఫిక్ పోలీసుల సహకారంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకున్నామన్నారు. అదనపు సిబ్బందిని నియమించామని, 16 గేట్లకు 10 గేట్ల ద్వారా హైదరాబాద్, విజయవాడ వైపు వాహనాలను పంపించినట్లు తెలిపారు. ఫాస్టాగ్ విధానంతో వచ్చిన వాహనాలు వచ్చినట్టుగా మూడు సెకన్లలోనే వాహనాలు గేటు దాటుతున్నాయన్నారు.

రద్దీగా కొర్లపహాడ్ టోల్‌గేట్

వాహనాల రాకపోకలతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌గేట్ రద్దీగా మారింది. హైదరాబాద్‌లో నివసిస్తున్న ఏపీలోని వివిధ ప్రాంతాల వారేగాక తెలంగాణలోని ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో ఈ నెల 10, 11, 12, 13న ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, సొంత వాహనాల్లో స్వగ్రామాలకు తరలివెళ్లారు. సోమవారం సాయంత్రం నుంచి తిరుగుముఖం పట్టిన వీరి వాహనాలు సోమవారం రాత్రి వరకు హైదరాబాద్‌కు చేరాయి. మంగళవారం కొంతమేర బుధవారం నాటికి హైవేపై వాహనాల రద్దీ సాధారణ స్థితికి చేరింది. వాహనాలతో 65వ నెంబర్ జాతీయ రహదారి నాలుగు రోజులపాటు వాహనాల రణగొణ ధ్వనులతో మార్మోగింది. సాధారణంగా ఈ రహదారిపై రోజుకు 22 వేల నుంచి 25వేల వరకు వివిధ రకాల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఓట్ల పండగ నేపథ్యంలో సాధారణ వాహనాలకు ప్రత్యేక వాహనాలు తోడవడంతో ఇరువైపులా ప్రయాణించే వాహనాల సంఖ్య రోజుకు 30వేల నుంచి 33వేలుగా ఉన్నట్లు తెలిసింది. పంతంగి టోల్‌ప్లాజా మీదుగా 3 లక్షల వాహనాలు రాకపోకలు కొనసాగించగా, అద్దంకి-నార్కట్‌పల్లి వైపు కొన్ని వాహనాలు మళ్లడంతో, కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా మీదుగా 1.20లక్షల వాహనాలు రాకపోకలు కొనసాగించాయి.

కేవీకేలో వరి విత్తనాల మేళా 24 న

త్రిపురారం, మే 15: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన వరి విత్తన మేళాను ఏర్పాటు చేయనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో వివిధ రకాల ఆధునిక వరి వంగడ విత్తనాలను ప్రదర్శిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్ట్

భువనగిరి రూరల్, మే 15: యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని బస్వాపురంలో లక్ష్మీనరసింహ మర్రిచెట్టు కింద ఉన్న గుడిలో ప్రతిష్ఠించిన కృష్ణుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి బుధవారం కోర్టులో రిమాండ్ చేసినట్టు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన యువకుడు చిక్క శేఖర్ మద్యం మత్తులో మంగళవారం రాత్రి గుడిలోని శ్రీకృష్ణుడి పాలరాతి విగ్రహాన్ని రాయితో కొట్టి ధ్వంసం చేశాడు. ఈ మేరకు అతని అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేసినట్టు తెలిపారు.

చెరువు శిఖం మట్టి తరలిస్తున్న ఇద్దరిపై కేసు

వేములపల్లి, మే 15: చెరువు శిఖం హద్దులు తొలగించి నకిలీ హద్దులతో చెరువు శిఖంను ఆక్రమించడంతోపాటు మట్టిని తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన కేతనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పుట్ట మహేష్ ఒక జేసీబీ, ఏడు ట్రాక్టర్ల ద్వారా గ్రామ శివారులోగల నియామల్కం (పెద్ద చెరువు)లోకి ప్రవేశించి చెరువు శిఖం హద్దులు తొలగించి ఆక్రమణలకు పాల్పడి మట్టి తరలిస్తున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఇరిగేషన్ ఏఈఈ ఎస్.సాయిరెడ్డి వేములపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి చేరుకున్న వారు జేసీబీ, ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని శ్రీనివాస్‌రెడ్డి, మహేష్‌లతోపాటు ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన



ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు



సూర్యాపేటటౌన్, మే 15: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్వీ ఆసుపత్రి ఎదుట మృతుడి కుటుంబ సభ్యులు బుధవారం ఆందోళన చేపట్టారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం తిర్మలగిరి గ్రామానికి చెందిన నకిరకంటి పుల్లయ్య(60) ఎనిమిది నెలలుగా ఆర్వీ ఆసుపత్రిలో సెక్యూరిటీగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి విధుల్లో చేరిన పుల్లయ్య ఉదయం ఆరు గంటల ప్రాంతంలో గుండెపోటుతో కిందపడిపోయాడని ఆస్పత్రి సిబ్బంది అతని కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. పుల్లయ్య గుండెపోటుతో మృతిచెందాడని ఆస్పత్రికి చేరుకున్న కుటుంబసభ్యులకు సిబ్బంది తెలిపారు. విద్యుదాఘాతంతో మృతిచెందాడని కుటుంబసభ్యులు ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఉదయం బాగానే ఉన్నాడని చూసినవారు చెప్పారని విధుల నుంచి ఇంటికి వచ్చే ముందు విద్యుదాఘాతంతో మృతిచెందాడని చెబుతున్నారని బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. ఆందోళనకారులకు సర్ధిచెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పుల్లయ్య సుమారు ఉదయం ఆరు గంటల సమయంలో ఆస్పత్రి ముందు కింద పడినట్లు సీసీకెమెరాలో ఉందని ఆస్పత్రి సిబ్బంది వెల్లడించారు.అయితే అంతకుముందు ఆస్పత్రికి సంబంధించిన నీటి బోరును వేసే సమయంలో విద్యుదాఘాతానికి గురై ఉంటాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి సిబ్బందిని వివరణ కోరగా విధులు ముగించుకొని వెళ్లే సమయంలో పుల్లయ్యకు గుండెపోటు రావడంతో గమనించిన ఆసుపత్రి సిబ్బంది చికిత్స అందించే సమయంలోనే మృతిచెందాడని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రత తగ్గుముఖం

నల్లగొండ, మే 15: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. బుధవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లిలో అత్యధికంగా 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా అత్యల్పంగా చింతపల్లి మండలం గొడకండ్లలో 36.2 డిగ్రీలు నమోదైంది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా మునగాల, మోతె మండలాల్లో 40.1డిగ్రీలు, అత్యల్పంగా నూతనకల్‌లో 31.6 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారంలో అత్యధికంగా 40.1 డిగ్రీలు, అత్యల్పంగా ఆలేరు మండలం శారాజీపేటలో 36.5 డిగ్రీలుగా నమోదైంది.

పిడుగుపాటుకు గేదె మృతి

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పిడుగుపడి గేదె మృతిచెందింది. మండల పరిధిలోని త్రిపురవరం గ్రామానికి చెందిన రైతు మాదాసు నాగుల్ తన గేదె బుధవారం వ్యవసాయ భూమిలో గడ్డి మేస్తుండగా పిడుగుపాటుకు గురై మృతిచెందింది. గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి



తేజా(ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా, చింతపల్లి మండలంలోని సాయిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గండేటీ తేజా(50) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలోని ఇందిరమ్మకాలనీలో నివాసముంటూ గీత కార్మికుడి వృత్తి కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కల్లు గీసేందుకు బుధవారం ఉదయం 6.30 గంటలకు బాటసింగారం పరిధిలోని తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. దీంతో అతడి తల, మెడ, కుడివైపు తొడపై తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తేజా భార్య సంతోష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయనకు భార్య సంతోష, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

వేసవి సెలవులు గుర్తుండిపోయేలా..

● ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్‌లో శిక్షణ ● సృజనాత్మకత కోసం డ్రాయింగ్, డ్యాన్స్‌లో మెళకువలు ● పీజీ ఎంట్రన్స్‌కు సిద్ధమవుతున్న డిగ్రీ విద్యార్థులు



కోదాడలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు



డ్యాన్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు

కోదాడ, మే 15: వేసవి సెలవులు గుర్తుండిపోయేలా విద్యార్థులు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. సెలవులను సద్వినియోగం చేసుకుంటూ డ్రాయింగ్, డాన్స్‌లో సృజనాత్మకతకు పదును పెడుతున్నారు. ఇష్టమైన సబ్జెక్టుల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఎంట్రన్స్‌లో ర్యాంకుల సాధనకు పదును పెడుతున్నారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు క్రికెట్, చదరంగం, క్యారమ్స్ లాంటి ఇండోర్, అవుట్‌డోర్ ఆటలు ఆడుతున్నారు. మరి కొందరు విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టుల్లో మెళకువలు, కంప్యూటర్, డ్రాయింగ్, డ్యాన్స్‌తోపాటు, నవోదయ, గురుకులలో సీటు పొందేందుకు శిక్షణ తీసుకుంటున్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు సెలవుల్లో సిలబస్‌పై పట్టు సాధించి ఏపీఆర్‌జేసీ, ఐటీఐ, పాలిటెక్నిక్, ఎంసెట్, టీటీసీ, ఏపీఆర్‌డీసీ, బీఎడ్, ఎంఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ వంటి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు మెదడుకు పదును పెడుతున్నారు. నిరుద్యోగ యువత డీఎస్సీ, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలు రాసి కొలువు సాధించేందుకు కుస్తీ పడుతున్నారు. మే నెలలో వేసవి సెలవులలో విద్యార్థుల ఆట, పాటలతో పాటు, ప్రతిభ పాటవాలకు, పోటీ పరీక్షలకు, సృజనాత్మకతకు, కొత్త, కొత్త ఆలోచనలతో ఇష్టమైన వాటిలో నైపుణ్యం మెరుగుపరుచుకొని భవిష్యత్‌కు నెలవుగా మార్చుకుంటున్నారు.

మ్యాథ్స్‌పై అవగాహన వచ్చింది



వేసవి సెలవుల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మాథ్స్‌లో ఇచ్చిన శిక్షణలో మెళకువలు తీసుకున్నాను. దీంతో మ్యాథ్స్ సబెక్టుపై ఎలా పట్టు సాధించాలో తెలుసుకున్నా. ఫలితంగా ఉన్నత తరగతుల్లో గణితం సులభంగా చేయగలుగుతా. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స ఎలా చేసుకోవాలో వైద్యుల ద్వారా నేర్చుకున్నాను.

● పి. సోనికా 5వ తరగతి విద్యార్థిని, కోదాడ.

కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకున్నా



ఉన్నత చదువులకు కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీషులో మంచి నైపుణ్యం అవసరం. ఈక్రమంలో వేసవి సెలవులలో ఉదయం, సాయంత్రం వేళలలో స్పోకెన్ ఇంగ్లీషుతో పాటు కంప్యూటర్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఆటలతో పాటు, వీటిలో శిక్షణ పొందుతున్నాను.

● జి, వంశీభార్గవ్ 8వ తరగతి విద్యార్థి, కోదాడ.

కోచింగ్ తీసుకుంటున్నా



డిగ్రీ పూర్తి చేశా. ఐసెట్‌లో సీటు సాధించేందుకు కోచింగ్ తీసుకుంటున్నాను. మంచి ర్యాంకు కోసం కష్టపడాలి. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని చదువుకోవాలి. అందుకని వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని, ఉత్తమ ర్యాంకు సాధనకు కష్టపడుతున్నాను.

● జి. పుష్పలత డిగ్రీ విద్యార్థిని, కోదాడ.

సీటు రావాలంటే కష్టపడాలి



పీజీ సెట్‌కు సిద్ధం అవుతున్నాను. పోటీ పరీక్షలలో సీటు రావాలంటే కష్టపడాలి. పోటీ తత్వం ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో డిగ్రీ పరీక్షలు పూర్తికాగానే సిలబసుతోపాటు, పరీక్షలో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు దొరికే ఇతర పుస్తకాలు చదువుతున్నాను. వేసవి సెలవులంటేనే విద్యార్థులకు పరీక్షల కాలం. పరీక్షల్లో రాణించే విధంగా సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నాం.

● కె. నరేష్ డిగ్రీ, విద్యార్థి కోదాడ.

నల్లగొండలో అత్యధిక మెజార్టీతో గెలుస్తాం

● కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి



మాట్లాడుతున్న మాజీమంత్రి కుందూరు జానారెడ్డి

మిర్యాలగూడ, మే 15: నల్లగొండ ఎంపీ స్థానాన్ని తెలంగాణలో అత్యధిక మెజార్టీతో గెలుచుకుంటామని మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. స్థానిక రఘువీర్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ శంకర్‌నాయక్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవిలతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజారంజకమైన కాంగ్రెస్ పాలనవైపే ప్రజలు మొగ్గుచూపారన్నారు. దేశంలో 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజా సంక్షేమంతో పాటు అభివృద్ధిపైనే దృష్టి సారించారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి జరిగిందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రజలకు మేలు జరగలేదన్నారు. దేశ ప్రజలు తిరిగి కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. రాష్ట్రంలో నల్లగొండ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి అత్యధిక మెజార్టీ లభిస్తుందన్నారు. 3.5 నుంచి 5.5 లక్షల మధ్య మెజార్టీతో రఘువీర్‌రెడ్డి విజయం సాధిస్తారన్నారు. ఎన్నికల్లో ఎటువంటి హింసకు తావులేకుండా ప్రశాంతంగా ప్రజలు ఓట్లు వేసినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి వామపక్షాలు, జనసమితి, టీడీపీ, అన్ని ప్రజాసంఘాలు కలిసి ఇండియా కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పగిడి రామలింగం, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి బాలు, తమ్మడబోయిన అర్జున్, తలకొప్పుల సైదులు తదితరులు పాల్గొన్నారు.



వేసవి సెలవులను చిన్నారులు ఎంజాయ్ చేస్తున్నారు. అందులో భాగంగా చిన్నారులు జిల్లా కేంద్రం శివారు పానగల్ ఉదయ సముద్రం సమీపంలోని కాల్వ వద్ద ఈత కొడుతున్నారు. రోజూ ఈత కొట్టేందుకు వస్తున్న చిన్నారులతో ఆ ప్రాంతం సందడిగా మారుతోంది.

● స్టాఫ్ ఫొటో గ్రాఫర్, నల్లగొండ

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

తుర్కపల్లి, మే 15: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని భువనగిరి-గజ్వేల్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. భువనగిరి జిల్లాకేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతిచెందాడు. ఎస్ఐ తక్యుయోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధిపేట జిల్లా ములుగు మండలకేంద్రానికి చెందిన చిన్నన్నగారి మహిపాల్‌రెడి (39) ఆయన భార్య నవిత(36)తో కలిసి మోటార్ సైకిల్‌పై తుర్కపల్లి మండలకేంద్రంలో ఉన్న తన బంధువుల ఇంటికి వస్తున్నాడు. వాసాలమర్రి ఆర్‌అండ్‌బీ రోడ్డు కమాన్ కింద నుంచి జాతీయ రహదారిపైకి ఎక్కుతున్న క్రమంలో తుర్కపల్లి వైపు నుంచి జగదేవ్‌పూర్ వెళ్తున్న కారు అతి వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిపాల్‌రెడ్డి, అతని భార్య నవితకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకోని క్షతగాత్రులను 108వాహనంలో భువనగిరి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మహిపాల్‌రెడ్డి మృతిచె ందాడు. భార్య నవితకు మెరుగైన చికిత్స అందించేందుకు హైదరాబాద్‌కు తరలించి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మహిపాల్‌రెడ్డి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓటు వేసేందుకు వెళ్లి తిరిగివస్తూ మృత్యు ఒడిలోకి..

చౌటుప్పల్ రూరల్: ఓటు వేసేందుకు ఏపీ రాష్ట్రం వెళ్ళిన ఓ ప్రైవేటు ఉద్యోగి హైదరాబాద్ బయలుదేరి మార్గమధ్యంలో మృతిచెందాడు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు సమీపంలో ఈ సంఘటన జరిగింది. చౌటుప్పల్ సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రికి చెందిన కొనికల దీపక్ రాజ్(29), అనిరుద్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఉంటూ ప్రైవేటు ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకుని హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. పంతంగి టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు పక్కన నిలిపిన కంటైనర్ లారీని అదుపు తప్పి ఢీ కొట్టారు. దీపక్‌రాజ్ మృతిచెందగా అనిరుద్ తీవ్రంగా గాయపడ్డాడు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



పెర్కకొండారం జాతీయ రహదారి పక్కకు బోల్తా పడిన డీసీఎం, వరికోత మిషన్

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు..

చందంపేట: గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుగొమ్ము మండలకేంద్రానికి చెందిన ఎద్దు కిరణ్(29) దేవరకొండలో జోమాటో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు పూర్తి చేసుకొని బైక్‌పై స్వగ్రామం నేరేడుగొమ్ముకు వెళుతుండగా పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్దకురాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. కిరణ్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కిరణ్ అవివాహితుడు.

రోడ్డు దాటుతుండగా..

మిర్యాలగూడ అర్బన్ : వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతన్న ఓ వృద్ధుడిని అదుపుతప్పి ఢీకొట్టింది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామం వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై బుధవారం జరిగింది. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ పట్టణం వాసవీనగర్ కాలనీకి చెందిన గౌరు మట్టయ్య(70) కొత్తగూడెంలోని వృద్ధాశ్రమంలో పదేళ్లుగా ఉంటున్నాడు. సామాగ్రి కొనుగోలు చేసుకునేందుకు ఆశ్రమం నుంచి బయటకు వచ్చి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్న క్రమంలో మిర్యాలగూడ నుంచి దామరచర్ల వైపు వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి ఢీ కొట్టింది. ఈ సంఘటనలో వృద్ధుడు మట్టయ్య తల భాగంలో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి మృతుడి కుమారుడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

డీసీఎం బోల్తా.. ముగ్గురికి గాయాలు

శాలిగౌరారం: వరికోత మిషన్‌ను తీసుకెళ్తున్న డీసీఎం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం పెర్కకొండారం వద్ద బోల్తా పడింది. ఎస్ఐ వాసా ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ నుంచి వరంగల్‌కు ఏపీ29 డీ5764 నెంబర్ గల డీసీఎం వరికోత మిషన్‌ను లోడు చేసుకుని బయలు దేరింది. పెర్కకొండారం వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వేగంగా వస్తున్న లారీని, వరికోత మిషన్‌ను తీసుకెళ్తున్న డీసీఎంను డ్రైవర్ పక్కకు తప్పించారు. దీంతో డీసీఎం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో డీసీ ఎం డ్రైవర్ కత్తుల శివరాజుకు నడుము విరిగి తీవ్ర గాయాలయ్యాయి. వరికోత మిషన్ ఆపరేటర్ రాయి చంద్రశేఖర్, క్లీనర్ పరిమళ్ కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థాని కులు నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బోల్తా పడిన డీసీ ఎం, వరికోత మిషన్ నుజ్జునుజ్జయ్యాయి. బోల్తా పడిన డీసీఎం టైర్లు, వరి కోత మిషన్ టైర్లు, ఇతర పరికరాలను కొందరు దొంగిలించినట్లు డీసీఎం యజమాని బచ్చు శ్రీనివాస్ శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోత్కూరు: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీహార్‌కు చెందిన ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. కార్మికులు మానిక్ షా, నజీమల్ ఇద్దరూ స్కూటర్‌పై వెళుతూ పాడిగేదెను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిద్దరిని చికిత్స నిమత్తం 108లో నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించినట్లు పైలెట్ సోమేష్, ఈఎంటి మహేష్ తెలిపారు.

చూడముచ్చటగా నవ నృసింహుల సాలహారం



ఆలయంలో నవ నృసింహుల దివ్య స్వరూపాలతో సాలహారం

మఠంపల్లి, మే 15: రాష్ట్రంలో రెండో యాదగిరిగుట్టగా విరాజిల్లుతున్న సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నవ నృసింహుల దివ్య స్వరూపాలతో సాలహారం నిర్మాణం అద్భుతంగా చేపట్టారు. దీంతో భక్తుల చిరకాల స్వప్నం సాకారమైంది. మహాక్షేత్రంలో రాజగోపురానికి ఇరువైపుల ఉభయ రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన తొమ్మిది నారసింహ క్షేత్రాల్లోని స్వయంభువులను ఆలయప్రాకారంలో తీర్చిదిద్దారు. దేవాలయ నిధుల రూ.30లక్షలతో 130 అడుగుల పొడవు, 12 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన మండప ఆకృతుల్లో మట్టపల్లి లక్ష్మీనృసింహుడు, వాడపల్లి జ్వాలా నృసింహుడు, కేతవరం వజ్రాల నృసింహుడు, వేదాద్రి యోగానంద లక్ష్మీనృసింహస్వామి, మంగళగిరి పానకాల నరసింహస్వామి, అహోబిలం జ్వాలా నరసింహస్వామి, యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి, సింహాచలం లక్ష్మీనరసింహస్వామి, పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి తేజోమూర్తులు ఆసీనులైనట్లు చిత్రకారులు కళానైపుణ్యాన్ని చాటి పంచవర్ణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఈ నెల 21 నుంచి పాంచహ్నికంగా జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల నాటికి సాలహారం పూర్తి చేయాలన్న సంకల్పం నెరవేరిందని ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, చెన్నూరి విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ మంగళవారం తెలిపారు.

దాతల సహకారంతో ఆలయంలో అభివృద్ధి పనులు

దాతలు, భక్తుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. వేలాది భక్తులు కూర్చొని స్వామివారి బ్రహ్మోత్సవాలు వీక్షించేలా మండపం వద్ద సుమారు రూ.7కోట్లతో ఆరు యూనిట్ల మేర సీసీ పనులు చేపట్టారు. ప్రతీ శుక్ర, శనివారాల్లో క్షేత్రంలో బస చేసేందుకు వచ్చే భక్తులు రాత్రివేళ నిద్రించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతోంది. గతంలో రాజగోపురం ప్రధాన ద్వారం వద్ద, పక్కనే ఇరుకుగా ఉన్న దుకాణాల సముదాయాన్ని తొలగించి విశాల మైదానంలో ఏర్పాటు చేశారు. భక్తులు స్నానాలు ఆచరించేందుకు సాలహారం సమీపంలో 5వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకును సిద్ధం చేస్తున్నారు. హుజూర్‌నగర్ యూబీఐ సహకారంతో తాగునీటి కోసం నిరంతరం శుద్ధ జలాలను సరఫరా చేసేందుకు రెండు అధునాతన శీతల యంత్రాలను సమకూర్చారు. వేసవిలో భక్తులకు ఎండ నుంచి ఉపశమనం కోసం తిరువీధులతోపాటు ముఖ మండపం, సింహద్వారాల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ నెల 21నుంచి జరిగే స్వామి వారి కల్యాణోత్సవం నాటికి మిగిలిన పనులను పూర్తి చేసేందుకు ఆలయ ధర్మకర్తలు, ఈవో శ్రమిస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి: బీర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

భువనగిరి అర్బన్, మే 15: పట్టభద్రుల కోసం ప్రభుత్వం చేపట్టబోయే సంక్షేమంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కోరారు. బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరి గుట్టలో జరిగిన కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుడి ప్రతి నాయకుడికి తమ తోడ్పాటునందిస్తూ విస్తృతంగా పర్యటి స్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌కు డిపాజిట్ కూడా దక్కదన్నారు. బతుకు, ఉద్యోగ రీత్యా పట్టభద్రులను గుర్తించి ప్రజాపాలన మీ ముందుకు వచ్చిందనే నినాదంతో ముందుకెళ్లాలని కార్యకర్తలకు చెప్పారు. పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ ఎన్ని ఆఫర్లు ఇచ్చినా వాటికి తలవంచలేదని, తాను ఎల్లప్పుడు ప్రజా సేవకుడినని అన్నారు. ఆలేరు గడ్డ గొప్ప వ్యక్తులను అందించిన నెల అన్నారు. తాను సేవకుడిగా పని చేస్తానని, ఈ ప్రాంత ప్రజల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశానన్నారు. ఆలేరు ప్రజల ఆశయాలు ముందుకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వలేని పరిస్థితి ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన సమయంలో ఉద్యోగులకు జీతాలు అందుతున్నాయని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి ప్రభు త్వం ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ చేస్తుందన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా జాబ్ క్యాలండర్ విడుదల చేయాలని తాను సీఎంను కోరినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా 10,500 మంది పట్టభద్రులు ఉన్నారని, వారందరు మొదటి ప్రాధాన్య ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, యాదగిరిగుట్ట, ఆలేరు, ఆత్మకూర్(ఎం) ఎంపీ పీలు చీర శ్రీశైలం, గంధమల్ల అశోక్, తండ మంగమ్మ శ్రీశైలం, జడ్పీ టీసీ నరేందర్‌గుప్త, నాయకులు జనగాం ఉపేందర్‌రెడ్డి, నీల పద్మ, కానుగు బాలరాజు, మహేందర్‌గౌడ్, చిన్నింటి మల్లేశం, కొండ్రోజు వెంకటేశ్వరరాజు, శంకర్‌నాయక్, యాస లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నేడు

దేవరకొండ, కొండమల్లేపల్లి మే 15: దేవరకొండ పట్టణంలోని పీపీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొర్ర రాంసింగ్, కొండమల్లేపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపును కాంక్షిస్తూ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న హాజరవుతున్నారని, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, యూత్ కాంగ్రెస్, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు, పట్టభద్రులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

కనిలాల్ మృతి బాధాకరం : గుత్తా



కనిలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

దేవరకొం డ, మే 15: దేవరకొండ మండలం రత్యతండా బీఆర్ఎస్ మాజీ సర్పంచ్, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్ తండ్రి రమావత్ కనిలాల్ మృతి బాధాకరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన రత్యతండాకు చేరుకొని మాజీ సర్పంచ్ కనిలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రవీంద్రకుమార్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రత్యతండా సర్పంచ్‌గా కనిలాల్ ఆ గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సంతాపం తెలిపిన వారిలో దేవరకొండ మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, శిరందాసు కృష్ణయ్య, చింతపల్లి సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీబాలాజీ న్యూరో ఆస్పత్రిలో రోగికి అరుదైన శస్త్రచికిత్స



బాధితురాలు మంగమ్మతో వైద్యులు, ఆస్పత్రి నిర్వాహకులు

మిర్యాలగూడ అర్బన్, మే 15: మెడ స్టిఫ్‌నెస్ కోల్పోయి తీవ్ర జ్వరం, వాంతులతో బాధపడుతున్న మహిళా రోగికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను మిర్యాలగూడ డాక్టర్స్ కాలనీలోని శ్రీ బాలాజీ న్యూరోకేర్ అండ్ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్లు పోశం సునీత, చిలుకూరి గోపినాథ్ బుధవారం వివరాలు వెల్లడించారు. దామరచర్ల మండలం బొత్తలపాలెం గ్రామానికి చెందిన కసిరెడ్డి మంగమ్మ అనే మహిళ అకస్మాత్తుగా తీవ్ర అనారోగ్యానికి గురైంది. మెడ నిలుపుదల కోల్పోయి అపస్మారక స్థితిలోకి వెళ్లగా మంగళవారం ఆమె కుటుంబసభ్యులు శ్రీబాలాజీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. న్యూరో ఫిజిషియన్ డాక్టర్ అభిషేక్ ఎమ్మారై స్కానింగ్ చేసి మెదడులో వాపు, రక్తపు గడ్డలు, నీరు చేరినట్లుగా గుర్తించి శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. రోగి కుటుంబసభ్యులకు సమస్యను వివరించి వైద్యసేవలు మొదలుపెట్టారు. సీఎస్ఎఫ్ ద్వారా వెన్నుపూస నుంచి నీరు తీసి పమోజెనిక్ మెన్‌జైమస్ వ్యాధిగా నిర్ధారించారు. అనంతరం శస్త్రచికిత్స ద్వారా మెదడులోని నీరు, రక్తపు గడ్డలను అధునాతన టెక్నాలజీ ద్వారా తొలగించినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం మంగమ్మ ఆరోగ్య పరిస్థితి సాధారణంగా ఉందని, నడవడం, మాట్లాడడం, కుటుంబసభ్యులను గుర్తిస్తున్నట్లు డాక్టర్ అభిషేక్ తెలిపారు. శస్త్రచికిత్స పూర్తి చేసేందుకు తమ వైద్యబృందం సుమారు 5 గంటల పాటు శ్రమించినట్లు తెలిపారు. అరుదైన వైద్యసేవల ద్వారా మహిళను ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడిన వైద్యులకు మహిళ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా సాధారణ, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రజలకు తక్కువ ఖర్చులో మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆస్పత్రి ఎండీ సునీత తెలిపారు.

మునుగోడుకు అధిక నిధులు కేటాయించాలి

● సీఎంను కోరిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న కైలాష్‌నేత

మునుగోడు, మే 15: మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం అధిక నిధులు కేటాయించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్‌నేత కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాతో పాటు ప్రత్యేకంగా మునుగోడు తన సొంత నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి మెరుగైన ఫలితాలు వస్తాయని సీఎంకు విన్నవించినట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ తమ పార్టీ సత్తాచాటనుందని ధీమా వ్యక్తం చేశారు.

18న ప్రతిభ పురస్కారాల ప్రదానం



డీఈవోను సన్మానిస్తున్న గ్లోబల్ ఫ్యామిలీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి

నల్లగొండ, మే 15: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రాబట్టిన ప్రధానోపాధ్యాయులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థ వైస్ చైర్మన్ యానాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం డీఈవో బొల్లారం బిక్షపతిని ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ మండలంలోని 27 ప్రభుత్వ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో 79 మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. వారికి విశిష్ట సేవలు అందించిన 27 మంది ప్రధానోపాధ్యాయులకు ప్రతిభ పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీన జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల కాళోజీ ఆడిటోరియంలో నిర్వహించే సమావేశంలో పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా నల్లగొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేందుకు కృషి చేసిన హెచ్‌ఎంలకు అవార్డులను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ నర్సింహ, డీసీఈబీ సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్, నల్లగొండ ఎంఈవో కొమ్ము అరుంధతి, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చీఫ్ అడ్వైజర్ గోనారెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

● సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్



సమావేశంలో మాట్లాడుతున్న డబ్బీకార్ మల్లేష్

మిర్యాలగూడ, మే 15: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేపడతామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా, మండల కమిటీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 19వ తేదీన జరిగే పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో సుందరయ్య వర్ధంతి సభలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మిర్యాలగూడలో 19వ తేదీన నిర్వహించే సభలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలను సమాయత్తం చేసే విధంగా చేపట్టే కార్యాచరణపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్థాయిలో ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అన్ని మండల కమిటీ సభ్యులు, శాఖల కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీష్ చంద్ర, మల్లు గౌతంరెడ్డి, భవాండ్ల పాండు, శవిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, ఆయూబ్, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రాంమూర్తి, ఎండీ అంజద్, రొండి శ్రీనివాస్, జాతంగి సైదులు. జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● దేవరకొండ ఆర్టీసీ డీఎం రాజీవ్‌ప్రేమ్‌కుమార్



పైప్‌లైన్ లీకేజీని పరిశీలిస్తున్న ఆర్టీసీ డీఎం రాజీవ్ ప్రేమ్‌సాగర్

కొండమల్లేపల్లి, మే 15: ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని దేవరకొండ ఆర్టీసీ డీఎం రాజీవ్ ప్రేమ్ కుమార్ అన్నారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్డి పైప్‌లైన్ లీకేజీ కావడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి'లో 'కంపుకొడుతోంది' శీర్షికన బుధవారం ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. బుధవారం కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండును ఆర్టీసీ డీఎం రాజీవ్‌ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్టాండులో రద్దీ బాగా పెరిగిందని తెలిపారు. అప్పట్లో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి పైప్‌లైన్ చిన్నవి కావడంతో పైపుల్లో చెత్తా చెదారం చేరి లీకేజీ అవుతుందని పేర్కొన్నారు. దీంతో దుర్వాసన వస్తుందని తెలిపారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీరు, వసతి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి మిషన్ భగీరథ నీరు ప్రయాణికులకు అందే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. మరుగుదొడ్డి పైప్‌లైన్ లీకేజీ కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట ఆర్టీసీ సీఐ సైదులు, ఆర్ఎస్.రావు, సిబ్బంది ఉన్నారు.

భువనగిరిలో కాంగ్రెస్‌దే విజయం

● ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



శాలిగౌరారంలో యువకులతో మాట్లాడుతున్న చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, మే 15: భువనగిరి పార్లమెంటులో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. శాలిగౌరారంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌కు కంచుకోట అయిన భువనగిరిలో బీజేపీ గాలివీచినా గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి అంచెలంచెలుగా అమలు చేస్తారని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్లకొండ పరమేష్‌గౌడ్, నాయకులు వేముల భరత్, బొల్లికొండ గణేష్, అన్నెబోయిన అనిల్‌కుమార్, కల్లూరి శ్రీకాంత్, చామల రాము పాల్గొన్నారు.

శాలిగౌరారంలో 73.20 శాతం ఓటింగ్

శాలిగౌరారం, మే 15: శాలిగౌరారం మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే పార్లమెంటు ఎన్నికల్లో 13 శాతం ఓటింగ్ తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో 39,386 ఓటర్లకు గాను 34,239 మంది ఓటర్లు ఓటు వేశారు. అప్పుడు 86.93 శాతం మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో మండలంలో 40,410 ఓటర్లు ఉండగా కేవలం 29,580 మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ సారి 73.20 శాతం ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. గతంలో కంటే ఈ సారి ఓటర్లు పెరిగినా ఓటింగ్ 13 శాతం తగ్గింది. ప్రతీ ఓటరు విధిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఇటు ప్రభుత్వం, అటు ఎలక్షన్ కమిటీ ప్రచారం చేసినా ఫలితం లేదు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన రోడ్డు తొలగింపు



నార్కట్‌పల్లి పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వేసిన రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ఐబీ అధికారులు

నార్కట్‌పల్లి, మే 15: నార్కట్‌పల్లి పెద్దచెరువు భూమిని ఆక్రమించి వెంచరుకు రోడ్డు వేశారని కొంత కాలంగా వచ్చిన ఫిర్యాదులపై నీటి పారుదల శాఖ అధికారులు ఎట్టకేలకు క్షేత్రస్థాయిలో చర్యలను చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన రోడ్డును రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సహాయంతో ఐబీ డీఈ ఈ విఠలేశ్వర్ ఆధ్వర్యంలో బుధవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. తమ వెంచరుకు ఎగువన ఉన్న వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు రైతుల విజ్ఞప్తి మేరకే రోడ్డు వేశామని నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు అధికారులు ఇచ్చిన అనుమతి పత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. రైతులు అడిగితే మాత్రం చెరువు శిఖం భూమిలో ఐబీ శాఖ అనుమతి లేకుండా, నిబంధనలు పాటించకుండా రోడ్డు ఎలా వేస్తారని ఐబీ అధికారులు నిలదీశారు. ఐబీ అధికారులు శిఖం పరిధిలోకి వచ్చే కల్వర్టు వద్ద రోడ్డుకు ట్రంచ్ కటింగ్ చేయించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలను అతిక్రమించి చెరువు శిఖం భూమిలో సుమారు 200 మీటర్ల మేర రోడ్డు వేసినట్లు గుర్తించినట్లు విఠలేశ్వర్ తెలిపారు. తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్‌రావు, ఐబీ ఏఈలు రమాదేవి, ఆంజనేయులు, ఆర్ఐ తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా రేణుకాఎల్లమ్మ తల్లి



దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

కనగల్, మే 15: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు వైశాఖమాసం బుద్ధాష్టమిలో భాగంగా బుధవారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె, ఒడి బియ్యం బోననైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మిర్యాలగూడ, మే 15: కాలుష్యకారక ఇటుక బట్టీల నిర్వహిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జగన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీవో శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా శ్రీనివాస్‌నగర్‌లో ఇటుకబట్టీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లకు వెళ్లే దారిని కూడా ఇటుక బట్టీల యాజమాన్యం ఆక్రమించడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. తక్షణమే అక్కడ నుంచి బట్టీలు తొలగించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న, నుమాన్, జావీద్, బిస్మిల్లా, తరుణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

నిడమనూరు, మే 15: నిడమనూరు మండలం ముకుందాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన 50 మంది పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వారంతా ఒకే చోట చదువుకుని, మూడు దశాబ్దాల తర్వాత అదేచోట కలుసుకున్నారు. ఆప్యాయంగా ఆనందంతో ఒకరినొకరు పలకరించుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుని ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరి, దండించిన ఉపాధ్యాయుల తీరును గుర్తు చేసుకున్నారు. పసుపుల కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమ్మేళనంలో విద్యా బుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసిన గురువులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. సమ్మేళనంలో పలువురు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం వల్ల మానవ సంబంధాలు మెరుగుపడతాయన్నారు. 30ఏళ్ల తర్వాత ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నంద్యాల సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఇస్మాయిల్, ఇంద్రసేనారెడ్డి, రాం ఎల్లయ్య, ఇబ్రహీం, శ్యాంసుందర్, సయ్యద్‌అలీ, శ్రీనివాస్, మంజుల, రాధిక, జయమ్మ, నాగభూషణ్, సురేష్, సతీష్‌రెడ్డి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

హాలియా: హాలియా మునిసిపాలిటీలోని నిర్మల ఉన్నత పాఠశాలకు చెందిన 2006- 2007 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అప్పటి గురువులు మేరీ రాణి సిస్టర్, వీవీఎస్ రెడ్డి, రాములు, జయ, కమ్రుద్దీన్, విజయజ్యోతి, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, పీఈటీ డొనిమిక్‌లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఇప్పుడు ఉన్నత హోదాలో ఉండటం చాలా గర్వంగా, ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గద్దె సందీప్, ముక్కోజు నగేష్, మస్తాన్ బేగ్, కర్నె శివకృష్ణ, లెనిన్‌బాబు, యడవల్లి నాగరాజు, దూప్‌సింగ్, గోపిశెట్టి సైదులు, పిల్లి గౌతమ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హాలియా: ఒకే చోట కలిసిన పూర్వ విద్యార్థులు, ఆనాటి గురువులు

యువకులు క్రీడల్లో రాణించాలి

డిండి, మే 15: యువకులు క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో బుధవారం యువకులకు ఆయన క్రికెట్ కిట్లు అందజేసి మాట్లాడారు. క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నూకం వెంకటేష్, అవుట మల్లేష్, పెరుమాళ్ల అనిల్, దామోదర్, ప్రేమ్‌కుమార్, హుస్సేన్, అరవింద్, అమృత్, అజేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

ముప్పారం ఆటో యూనియన్ అధ్యక్షుడిగా కొండల్

నిడమనూరు: మండలంలోని ముప్పారం ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఆదిముళ్ల కొండల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని శ్రీ కోటమైసమ్మ ఆలయం వద్ద జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండల్‌తో పాటు ఉపాధ్యక్షుడు కొల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆలంపల్లి నరేష్, కార్యవర్గ సభ్యులను గణపురం కొండల్, చేగొండి శంకర్, రూపని లక్ష్మీనారాయణ, గణపురం శ్రీనివాస్, అన్నెబోయిన లక్ష్మీనారాయణ, మైసయ్య, నర్సింగు పరశురాం, శంకర్, కృష్ణ ఎన్నికయ్యారు.

కొంపల్లిలో వైద్యశిబిరం

మునుగోడురూరల్: మండలంలోని కొంపల్లి గ్రామంలో హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. యశోద ఆస్పత్రి వైద్య బృందం జై శ్రీగురు ప్రవాంత్ రాధిక, సంతోషి, ఉమాదేవ గ్రామంలోని 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ జాల వెంకటేశ్వర్లుయాదవ్, వైద్యశిబిరం నిర్వాహకులు నామోజు రత్నాచారి, గ్రామ పెద్దలు మక్కెన అప్పారావు, జీడిమెట్ల నరసింహ, జాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నల్లగొండ: మానవ హక్కుల ఉల్లంఘన జరగకుండా ఉండేందుకు, జవాబుదారీతనం, పారదర్శకత కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మానవ పౌర హక్కుల ప్రజావేగు, పారాలీగల్ వలంటీర్ కన్నెకంటి క్రాంతికుమార్ డీజీపీని కోరారు. పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలను, ఇతర పోలీస్ అధికారులను కలిసే సమయంలో మొబైల్‌ను నిషేధించడం ఏ చట్టంలో లేదన్నారు. పోలీస్ అధికారుల ఏకపక్ష నిర్ణయంలో కార్యాలయ సందర్శకుల మొబైల్‌ను బయటపెట్టించడం మానవ హక్కుల ఉల్లంఘనేనని తెలిపారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ

నల్లగొండ కల్చరల్: పట్టణంలోని మథర్ థెరిస్సా హోంలోని వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు నెస్లీల్ కంపెనీ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి లక్ష్మి, మాధవి, మల్లిక, రాగిణయ్య, నేలపట్ల నారాయణస్వామి, రాంబాబు, అంజయ్య, జంజిరాల గిరి, సింగం ప్రవీణ్, బాలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేయాలి

మాడ్గులపల్లి: ఎన్నికల హామీలను అమలుచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమలుకు సాధ్యం కాని హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

మిర్యాలగూడ టౌన్: తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కనపర్తి సత్యప్రసాద్ కోరారు. జంకుతండాలో తాగునీటితో పాటు డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామ కార్యదర్శి ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనాయక్, కిషన్, నరేష్, సుబ్రహ్మణ్యం, మల్లేష్, అంజి, రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

వేములపల్లి, మే 15: మండలంలోని మొల్కపట్నం గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన జెర్రిపోతుల సతీష్‌కు గ్రామంలోని అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రెమడాల భిక్షం సైతం కాలుకు గాయమవడంతో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో దశరథ్, సురేందర్, ప్రవీణ్, సతీష్, వెంకట్, శంకర్ పాల్గొన్నారు.

చండూరురూరల్: మండలంలోని వెలిమినేడులో 9వ వార్డుకు చెందిన దండ నర్సింహ ఇటీవల మృతి చెందాడు. అతని దశదినకర్మకు బీజేవైఎం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్ హాజరై మృతుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

లింగయ్య ప్రజాచైతన్య బావుటా

వేములపల్లి: పొలిశెట్టి లింగయ్య ప్రజాచైతన్య బావుటా అని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ బొలెద్దు పాల్ అన్నారు. పొలిశెట్టి లింగయ్య వర్ధంతి సందర్భంగా గురువారం మండలంలోని సల్కునూరు అడ్డరోడ్డులో ఉన్న ఆయన స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలిశెట్టి లింగయ్య గొప్ప పాటలను అందించిన ప్రజాకవి అని గుర్తు చేశారు. అనేక సినిమాలకు పాటలు కూడా అందించినట్లు పేర్కొన్నారు. ఆయన తన పాటలతో ఈ సమాజాన్ని ఉత్తేజం చేశారని కొనియాడారు. అనంతరం ఆయన అందించిన పాటలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కందుకూరి సుదర్శన్, నర్సింగోజు రవి, నకిరేకంటి కిరణ్‌కుమార్, బాలునాయక్, ప్రతాప్, బచ్చలకూరి శ్రీనివాస్, నాగిళ్ల కొండల్, శోభన్‌బాబు, మధు పాల్గొన్నారు.

బూర నర్సయ్యగౌడ్ విజయం ఖాయం

మునుగోడు: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించటం ఖాయమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు మాదగోని నరేందర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు విశ్వసించారని తెలిపారు. అంతేకాక బీసీ సామాజిక వర్గానికి చెందిన నర్సయ్యగౌడ్‌కు అన్ని పక్షాలు సైలెంట్‌గా ఓటేసి మద్దతు పలికారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు కర్నాటి శేఖర్, దుబ్బ జెల్లయ్య, పందుల యాదయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.